ప్రజాశక్తి

శుక్రవారం 3 మార్చి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

కలుషిత నీరు తాగి విద్యార్థినులకు అస్వస్థత

◆ వాంతులు, విరేచనాలు, జ్వరాలతో

వైద్యశాలలో చేరిన 36 మంది బాలికలు

◆ బాధితులను పరామర్శించిన

సబ్‌కలెక్టర్ సేతు మాధవన్, ఐటిడిఎ పిఒ



అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శిస్తున్న ఐటిడిఎ పిఒ రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

కలుషిత నీరు తాగడం వల్ల పలువురు విద్యార్థినులు వాంతులు, విరేచనాలు. జర్వాలతో అస్వస్థతకు గురయ్యారు. తరగతి గదిలోనే కుప్పకూలిపోయారు. అందిన సమాచారం మేరకు.. దోర్నాలలోని ఏకలవ్య బాలికల మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 460 మంది బాలికలు చదువు కుంటున్నారు. రోజులాగే తరగతులకు హాజరయ్యారు. మధ్యలోనే 36 మంది అస్వస్థతకు గురయ్యారు. అందులో 16 మంది వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడ్డారు.. 13 మందికి జ్వరం వచ్చింది. 11 మందిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. 16 మందికి పాఠశాలలో చికిత్స అందించారు. ఇటీవల పాఠశాలలోని బోరు మరమ్మతులకు గురైంది. దానికి మర్మతులు చేయించారు. బోరు నుంచి ఆర్ఒ ప్లాంట్‌కు వచ్చిన నీటిని విద్యార్థినులు తాగి అస్వస్థతకు గురయ్యారు. ఆర్ఒ ప్లాంట్ నీటిని పరీక్షలకు పంపించారు. విద్యార్థినులు మాత్రం బుధవారం స్నాక్స్‌లో గుగ్గిళ్ల ఇచ్చారని, అవి తినడం వల్లే తమకు ఇలా జరిగిందని చెబుతున్నారు. ఫుడ్ పాయిజనింగ్ కారణం గానే వాంతులు, విరేచనాలు ప్రబలినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ఐటిడిఎ పిఒ రవీంద్రారెడ్డి దోర్నాల వచ్చి చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు ప్రేభుత్వ వైద్య శాలకు తరలించారు. విద్యార్థులకు మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు. ప్రస్తుతానికి విద్యార్థినుల ఆర్యోగానికి ఇబ్బందులు లేవని వైద్యులు తెలిపారు. మూడు రోజులు పాటు పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు.



అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శిస్తున్న ఐటిడిఎ పిఒ రవీంద్రారెడ్డి

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

◆ ఘటనపై విచారణకు నిజ నిర్ధారణ కమిటీ

◆ మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్

పెద్దదోర్నాల : విద్యార్థినుల అస్వస్థతకు కారుకులైన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. అస్వస్థతకు గురై దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థిలను గురువారం రాత్రి ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. అనంతరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌కు వెళ్లి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ అందించే నివేదిక అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ రవీంద్రారెడ్డి, తహశీల్దారు వేణుగోపాల్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చీరాల

కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం దేశ సంపదను దోచి పెడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల నడ్డి విరగగొట్టే విధంగా గ్యాస్ ధరలు పెంచిన మోడీ ప్రభుత్వాన్ని సాగనంపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చీరాల గడియారం సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గ్యాస్ ధరలను నియంత్రిస్తానని మాయ మాటలు చెప్పినట్లు తెలిపారు. సబ్సిడీపై గ్యాస్ అందిస్తామని చెప్పి నేడు అమాంతంగా సిలిండర్ ధర రూ.1150 పెంచినట్లు విమర్శించారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు, చిరువ్యాపారులు గ్యాస్ సిలిండర్లు కొనలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాలకులు పేదల కష్టాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతూ, నిత్యవసర ధరలను నియంత్రించ కుండా ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ఇసుక, సిమెంటు,ఇనుము, మందులు ధరలను పెంచుకుంటూ పోతుందన్నారు. దేశ సంపద అయిన రైల్వే, పోర్టు,అడవులు ,గ్యాస్ లాంటి వ్యవస్థలను అదానీకి కట్ట బెడుతూ భారాలు ప్రజలపై మోపుతున్నట్లు విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య, కమిటీ సభ్యులు మణి లాల్ ,కష్ణమోహన్, నాయకులు కె.సురేష్, కిరణ్, మనోజ్ కుమార్, ఆర్య, సుభాషిని,లక్ష్మి, ఎన్.బాబూరావు, వసంతరావు, డి.నారప రెడ్డి, నాగరాణి, శరత్, దళిత బహుజన పార్టీ నాయకుడు జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడు నియోజకవర్గాల్లో..

అదుపు తప్పిన రాజకీయం

◆ పాలకపక్ష ఎమ్మెల్యేలకు సవాలుగా

అసమ్మతి నేతల వ్యవహారం

◆ పక్క జిల్లా నేతలు ఇన్‌ఛార్జులు

కావడంతో జోక్యం లేదంటున్న పార్టీ వర్గాలు

◆ ఇతర జిల్లాలకు ఇన్‌ఛార్జి కావడంతో

పట్టించుకోని సీనియర్ నేత బాలినేని



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మొన్నటి వరకూ సీనియర్ నేత బాలినేని వద్దనే రాజకీయ పంచాయతీలు సాగేవి. కొంత మేరకు అదుపులో ఉన్నట్లు కనిపించాయి. పాలకపక్షంలో మంత్రి గానూ.. తర్వాత పార్టీ కోఆర్డినేటర్ గానూ జిల్లాలో పార్టీలో అన్ని వ్యవహారాలు బాలినేని చూశారు. ఇపుడా పరిస్థితి లేదు. ఆయన పక్క జిల్లాలకు కోఆర్డినేటర్‌గా ఉన్నారు. ఇక్కడ పార్టీ వ్యవహారాల్లో పెద్దగా జోక్యం చేసుకోలేక పోతున్నారు.దీంతో ఇక్కడ పార్టీ వ్యవహారాలు దారి తప్పాయంటున్నారు. ముఖ్యంగా మూడు నియోజకవర్గాల్లో ఇపుడు అసమ్మతి సెగలు తీవ్రస్థాయికి చేరాయి. జిల్లాకు కోఆర్డినేటర్లుగా ఉన్న బీదా మస్తాన్‌రావు జిల్లాకు వస్తున్నారు.ఆయన ఎదుటే అసమ్మతి నేతలు తమ వాదనలు వినిపిస్తున్నారు. ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు వేరు కుంపట్లు పెడుతున్నారు. ముఖ్యంగా కొండపి, సంతనూతలపాడు, కనిగిరి నియోజకవర్గాల్లో తాజా పరిణామాలు పార్టీలోనే ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిని అదుపు చేసే పరిస్థితిలో నాయకత్వం కనిపించడంలేదు. కనిగిరి నియోజకవర్గస్థాయి సమీక్షలో ఎమ్మెల్యే బుర్రామధుసూధన్ యాదవ్‌కు వ్యతిరేకంగా పలువురు కీలక నేతలు దూరంగా ఉన్నారు. ప్రత్యేకంగా సమావేశం పెట్టారు. ఎమ్మెల్యే బుర్రా వ్యవహారశైలిపై కోఆర్డినేటర్‌కు ఫిర్యాదు చేశారు. తమను కలుపుకునిపోవడంలేదంటూ వాపోయారు. సమావేశం తేదీని కూడా ముందురోజునే చెప్పారని వెల్లడించారు. సమన్వయం లేదశ్రీతీ ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే బుర్రాను విభేదిస్తూ కీకలమైన సామాజికవర్గ నేతలు ఆయనకు దూరంగానే ఉంటున్నారు. అక్కడ రెండు శిబిరాలయ్యాయి. రెడ్డి కార్పొరేషన్‌ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి, పలువురు జడ్‌పిటిసిలు, ఎంపిపిలతో పాటు బుర్రా సామాజికవర్గం నేతలు కూడా కొందరు ఆయనపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. రానున్న కాలంలో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోనన్న ఆందోళన పెరుగుతోంది. తిరిగి బుర్రాకు సీటు ఇస్తే పనిచేయకూడదనే ఆలోచనలోనూ వారు ఉన్నారు. ఈ పరిణామాలు అధిష్టాన పెద్దలకు తలనొప్పిగా మారాయి. కొండపిలోనూ వీధి పోరాటాలకు దిగుతున్నారు. ఇళ్లపై దాడులు పెరిగాయి. ఇన్‌ఛార్జి వరికూటి ఆశోక్‌బాబుకు అసమ్మతి తగ్గడంలేదు. రోజురోజుకు ఇక్కడ పరిస్థితులు అదుపు తప్పుతున్నాయి. కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ఇంటిపై దాడి వ్యవహారం పార్టీలో ఇరువర్గాల మధ్య ఆజ్యం పోసింది .ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తుతున్నాయి. వైసిపి ▶ 2లో

'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-రేపల్లె

మండల కేంద్రంలో గల టీడీపీ కార్యాలయంలో గురువారం 'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకాన్ని పట్టణ పార్టీ అధ్యక్షులు గోగినేని పట్టాభి రామారావు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పట్టాభి రామారావు మాట్లాడుతూ.. వైసీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచకాలు, అక్రమాలు చాలా వరకూ పెరిగాయని, వీటిని ప్రశ్నించేవారిపై దాడులు చేయడం వైసీపీ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై సీబీఐ విచారణ త్వరితగతిన పూర్తిచేసి దోషులను తక్షణమే శిక్షించాలనారు. సీబీఐ విచారణలో అనేక వాస్తవాలు బయటపడుతున్నాయని అన్నారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలన్నిటినీ జోడించి జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని టీడీపీ విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి నిజాయితీ ఉంటే తన చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సిబిఐకి సహకరించి దోషులను శిక్షించేందుకు సహకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేకా పూర్ణచంద్రరావు, జీవి నాగేశ్వరరావు, కౌన్సిలర్ అన్నే రామకృష్ణ, దున్నా జయప్రద, కుదరవల్లి వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, యలవర్తి లక్ష్మీ మేకా రామకృష్ణ, తాడిపర్తి మల్లికార్జునరావు, తంగెళ్లమూడి సాయిబాబు, రామారావు ఫ్లీడర్, పంతాని సాయికుమార్, కమతం శివ, పందరబోయిన గోపి, ఆలూరి సురేష్, సజ్జా రాంప్రసాద్, బద్దెల సాయి, దాసరి అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి సానుభూతిపరులు

ఆ మూడు నియోజకవర్గాల్లో అదుపు తప్పిన రాజకీయం

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఇన్‌ఛార్జి మాదాసి వెంకయ్య కూడా అక్కడ తన వర్గాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. ఆయన కూడా వారికి అండగా ఉంటున్నారు. పార్టీలో రెండు వర్గాలూ ఒకరిపై ఒకరు అన్ని వ్యవహారాల్లో కత్తులు దూసుకునే పరిస్థితి వచ్చింది. పాలన కూడా పక్కదారి పట్టింది. అభివృద్ధి పనులు లేకుండా పోయాయి. కనీసం రోడ్లకు పడ్డ గుంతలు పూడ్చేతీరిక కూడా ఇక్కడ పాలకపక్ష నేతలకు లేకుండా పోయింది. గొడవలే ఎజండాగా సాగుతున్నాయి. పార్టీ నేతలు జోక్యం చేసుకుంటున్నా సర్దుబాటు కావడం లేదు. సంతనూతలపాడు నియోజకవర్గం విషయానికి వస్తే ఇక్కడా అదే పరిస్థితి. తాజాగా కమ్మ సామాజికవర్గం నేతలు రెండుసార్లు భేటీలు జరిపారు. రెండు నెలల క్రితం పెద్ద ఎత్తున సమావేశమైన నేతలు ఇప్పటికీ తమకు గుర్తింపులేదనే అసంతృప్తితోనే ఉన్నారు. రెండ్రోజుల క్రితం మళ్లీ నాగులుప్పలపాడు నేతలు భేటీ అయ్యారు. పార్టీకోసం కష్టపడిచేసినవారిని వదిలేస్తున్నారంటూ ఎమ్మెల్యేపై ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేయడానికి సముఖంగా లేమనే భావన వ్యక్తం చేశారు. ఇక్కడా పాలనలో పెత్తనం, పదవులు, కాంట్రాక్టులపైనే నేతల మధ్య పేచీలు వచ్చాయి. ద్వితీయశ్రేణి నేతల్లోనే వర్గాలు పెరిగాయి. వీటినిఎలా పరిష్కారం చేయాలో అంతుచిక్కక ఎమ్మెల్యే సుధాకర్‌బాబు తలపట్టు కుంటున్నారు. సామాజికపోరు పెరుగుతోంది. అభివృద్ధిపై చర్చలేదు. పెత్తనం వద్దనే రాద్ధాంతాలు సాగుతున్నాయి. గ్రామాల్లో వర్గాలు తీవ్రమయ్యాయి. గతంలోనూ ఈ నియోజకవర్గానికి సంబంధించిన అనేక పంచాయతీలు సీనియర్ నేత బాలినేని వద్ద సాగాయి. విజయవాడలోనూ భేటీలు జరిగాయి. ఒంగోలులోనూ పలుసార్లు వాడివేడిగా సమావేశాలు పెట్టారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు సంధించుకున్నారు. సమన్వయం ఎండమావిగా మారింది. ప్రస్తుతం ఈ మూడు నియోజకవర్గాల్లో పాలకపక్షంలో అసమ్మతి సెగలు తీవ్రస్థాయికి చేరాయి. వీటిపై ఇప్పటికీ బాలినేని వద్దకు పంచాయతీలు వస్తూనే ఉన్నాయి. ఆయన కోఆర్డినేటర్‌గా లేనందున పట్టీపట్టనట్లుగా ఉన్నారనే చర్చ కూడా ఉంది. ఆయన జోక్యం చేసుకుని సర్దుబాటు చేయాలని ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారు. ఎన్నికల నాటికి ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయోనన్న చర్చ ఉత్కంఠగా సాగుతోంది.

ఆడపిల్లను చదివించు.. రక్షించు

డాక్టర్ డి మానస

ప్రజాశక్తి-మద్దిపాడు

ఆడపిల్లలను చదివించి రక్షించుకోవాలని డాక్టర్ డి మానస పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గుండ్లాపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట విరుద్ధమని, అలాంటివారికి 5 సంవత్సరాల జైలు శిక్ష, వైద్య శాస్త్ర పట్టాను రద్దు చేస్తారని తెలిపారు. పరీక్ష చేయించుకున్న వారికి కూడా జైలు తప్పదన్నారు. ఆడ మగ ఒకటేనన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం: మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె

పేద ప్రజల ఆర్థికాభివృద్దే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బేతపూడి గ్రామంలో గురువారం నాలుగో రోజు ఆయన ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. రాష్ట్రంలో పేదరికంతో ఎవరూ ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పేదరికంతో విద్యార్థులు విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను రూపొందిస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, జగనన్న తోడు, జగనన్న గోరుముద్ద వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి విద్యార్థులకు మేనమామగా మారారన్నారు. మంచి మనస్సున్న పరిపాలనాదక్షుడికి ప్రకృతి సైతం సహకరిస్తుందనడానికి నిదర్శనంగా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి పాలనేనన్నారు. గడిచిన మూడున్నర సంవత్సరాల కాలంలో వర్షాలు సకాలంలో పడటంతో పాటు కాల్వలలో సమృద్ధిగా నీరురావటంతో పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలలో తమ పార్టీ అభ్యర్థులచే సింగిల్‌గా పోటీ చేసి గెలిచి తీరుతామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, సర్పంచ్ ఆలూరి పద్మ, జడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొమరాబత్తుని జయమ్మ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తహశీలారు బివి రమణారావు

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం పరిధిలోని ఎమ్మెల్సీ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేయవచ్చని తహశీల్దారు బివి రమణారావు తెలిపారు. మండలంలో మొత్తం 1,376 ఓటర్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీన కొత్తపట్నం జడ్పీ హైస్కూల్‌లో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు. టీచర్స్‌కు బూత్ నెంబర్ 37, గ్రాడ్యుయేట్స్‌కు బూత్ నెంబర్79, 79(ఏ) మూడు బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటర్స్ ఓట్లు వేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. గత నాలుగు రోజుల నుంచి బీఎల్ఓల ద్వారా ప్రతి ఓటరుకు స్లిప్పులు పంపిణీ చేస్తున్నామన్నారు. హెల్ప్ డెస్క్ నెంబర్ 8886616035 పూర్తి సమాచారం కోసం అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

సీసీనా.. మజాకా..

- దళిత మహిళల రుణాలు స్వాహా
- సంతకాలు ఫోర్జరీ చేసిన వైనం
- వెలుగులోకి 'ఉన్నతి' రుణం వ్యవహారం

ప్రజాశక్తి-పంగులూరు

డ్వాక్రా మహిళల నిరక్షరాస్యతను, అమాయకత్వాన్ని, సొమ్ము చేసుకుని దళిత, గిరిజన మహిళలకు, ప్రభుత్వం ఇస్తున్న 'ఉన్నతి' రుణాలను, వివోఏతో కుమ్మక్కై, అగ్రవర్ణ మహిళల పేరుతో రుణాన్ని తీసి, ఆ సొమ్ము మొత్తం స్వాహా చేసిన సీసీ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సొమ్ము మొత్తం స్వాహా చేసిన సిసి.. ఇప్పుడు తనకేం తెలియదని ఎదురు తిరగటంతో కథ అడ్డం తిరిగింది. ఆ రుణంతో సంబంధం లేని నిరక్షరాస్య మహిళలు, వారి పేరుతో బ్యాంకులో బాకీ ఉందని తెలిసి లబోదిబోమంటున్నారు. వివరాల్లోకెళ్తే.. మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో గల సుభాషిణి డ్వాక్రా మహిళలు అందరూ ఓసి మహిళలే. 2021వ సంవత్సరంలో దళిత, గిరిజన, మహిళలకు వడ్డీ లేని రుణంగా ఇచ్చే, ఉన్నతి రుణాలు రావడంతో, సుభాషిని డ్వాక్రా గ్రూప్‌లోని ఐదుగురు మహిళల పేరుతో ఉన్నతి రుణాలు తీసేందుకు అప్పటి సీసీ నరేంద్ర శ్రీలక్ష్మి, ఏపీవో మద్దిరెడ్డి ధనలక్ష్మి పథకం పన్నారు. గ్రూపులోని శృంగారపు సుభాషిణి, శృంగారపు శ్రీలక్ష్మి, శృంగారపు పద్మ, మద్దిరెడ్డి ధనలక్ష్మి, శృంగారపు శివ, వీరిని దళిత మహిళలుగా చూపించి, వీరి పేరుతో ఉన్నతి రుణం తీసుకునేందుకు తీర్మానం చేశారు. అయితే ఈ తీర్మానం



ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అందాల్సిన రుణాలను ఈ మహిళల పేరుతోనే తీశారు

విషయం ఈ ఐదుగురు మహిళలకు తెలియదు. ఐదుగురు మహిళలకూ తెలియకుండా వీరి సంతకాలను కూడా సిసి శ్రీలక్ష్మి, వివోఏ ధనలక్ష్మిలు ఫోర్జరీ చేశారు. ఫోర్జరీ చేసిన సంతకాలతో కూడిన తీర్మానాన్ని అప్పుడున్న ఏపీఎం కూడా ఓకే చేయటంతో, బ్యాంకులో ఈ ఐదుగురు పేరుతో రెండు లక్షల 43 వేల రూపాయల ఉన్నతి రుణాన్ని తీశారు. రుణాన్ని తీసేటప్పుడైనా ఆ మహిళలను తీసుకురమ్మని బ్యాంక్ అధికారులు అడుగగా అందులో ఒకామెకు బాగా జబ్బు చేసిందని, ఒకామెకు హెచ్ఐవి వ్యాధి ఉందని, మిగతా వారికి కూడా రకరకాల పనులు ఉన్నందువలన రాలేకపోతున్నారని చెప్పి, ఆ రుణం మొత్తం సీసీ శ్రీలక్ష్మి, వివోఏ ధనలక్ష్మి, 2021 జనవరి 30వ తేదీన, చందలూరు లోని కెనరా బ్యాంకులో తీశారు. ఈ డబ్బు మొత్తం శ్రీలక్ష్మి తన కుమారుల చదువుకు అవసరమని, తిరిగి రెండు నెలల్లో చెల్లిస్తానని చెప్పి వాడుకొని, ఇప్పుడు ఆ డబ్బుతో తనకేం సంబంధం లేదని చెబుతోందని అప్పుడు వివోఏగా చేసిన ధనలక్ష్మి చెబుతోంది. సీసీ శ్రీలక్ష్మి ఈ మండలంలోని నూజిల్లపల్లి, తక్కెళ్లపాడు గ్రామాల్లో జరిగిన డ్వాక్రా గ్రూపు అవినీతి కుంభకోణాల్లో ఉందని అధికారులు సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఉద్యోగం లేని శ్రీలక్ష్మి, ఆ డబ్బు గురించి తనకేమీ తెలియదంటూ, తాను ఎవరికీ చెల్లించాల్సిన అవసరం లేదంటూ చెబుతోందని అంటున్నారు. సుభాషిణి డ్వాక్రా గ్రూప్ మహిళలకు మూడు నెలల క్రితం రూ.పది లక్షల బ్యాంక్ రుణం మంజూరు కావడంతో, ఆ రుణాన్ని తీసుకునేందుకు బ్యాంకు దగ్గరికి వెళ్లినప్పుడు, మీ గ్రూపులో ఉన్నతి రుణం పేరుతో మూడు లక్షల రూపాయలు బాకీ ఉందని బ్యాంక్ అధికారులు చెప్పటంతో, ఆ డ్వాక్రా మహిళలు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ఈ విషయాన్ని అప్పటి వీవోఏ ధనలక్ష్మిని మహిళలు నిలయడంతో, ఈ విషయం బయటపడింది. అధికారులు ఇప్పటికైనా ఆ రుణాన్ని బ్యాంకుకు చెల్లించే విధంగా చర్యలు తీసుకొని, తమను రుణ విముక్తులను చేయాలని డ్వాక్రా మహిళలు కోరుతున్నారు.

సాగరు కాలువలో ఈతకు దిగి..
యువకుని మృతి

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ఒంగోలు బ్రాంచి కాలువలో ఈతకు దిగిన చిన్నంమాధవ(21) గల్లంతయ్యాడు. అనంతరం అతడి మృతదేహం లభ్యమయింది. అందిన వివరాల ప్రకారం.. జరుగుమల్లి మండలం నందనవనం (ప్రస్తుతం సుజాతనగర్, ఒంగోలు)కు చెందిన చిన్నంమాధవ ఒంగోలులోని రైజ్ కాలేజీలో మూడో ఏడాది ఇంజనీరింగ్ చదువుతున్నాడు. గురువారం చీమకుర్తి రామ్‌నగర్‌కు చెందిన తన మిత్రుని ఇంట్లో జరుగుతున్న కర్మ కార్యక్రమంలో పాల్గొనడానికి పదిమంది స్నేహితులతో కలిసి వచ్చారు. కార్యక్రమంలో పాల్గొని భోజనాలు చేశాక తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 3గంటల సమయంలో స్థానిక కెవి పాలెం బ్రిడ్జి సమీపంలో బైపాస్‌రోడ్డు పక్కనే ఉన్న సాగరు కాలువలో ముగ్గురు ఈతకు దిగారు. అయితే ఈత రాని మాధవ ప్రమాదవశాత్తు కాలువ



మృతిచెందిన అయ్యన్న

డ్రాపులో ఇరుక్కున్నాడు. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి ఉధృతికి మాధవ బయటకు రాలేకపోయాడు. మిగిలిన ఇరువురూ బయటకు రాగలిగారు. మాధవను రక్షించడానికి మిత్రులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. స్థానిక ఎస్ఐ వి ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకొని యువకుని కోసం గాలించారు. అనంతరం మాధవ మృతదేహం లభ్యమైంది.

నేడు, రేపు బాపట్లలో బెక్టగాన్-2023

ప్రజాశక్తి-బాపట్ల: ఇంజనీరింగ్ విద్యార్థులు పరిశోధనాత్మక సాంకేతిక శక్తికి మరింత పదును పెట్టేందుకు జాతీయ స్థాయిలో జిల్లా కేంద్రమైన బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహిస్తున్న బెక్ట గాన్-2023 ప్రదర్శనకు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ముస్తాబైంది. రెండు రోజులపాటు ఇక్కడ జరిగే ఈ ప్రదర్శనకు దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు హాజరవుతారు. అవసరమైన ఏర్పాట్లు బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్తయ్యాయి. బీఈసీలో జరిగే ప్రదర్శనకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ప్రదర్శనకు సాఫ్ట్ వేర్ సంస్థ టిసిఎస్ ఉపాధ్యక్షులు డాక్టర్ ఇఎన్ చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరౌతారు. వివిధ రాష్ట్రాలు పలు ఇంజనీరింగ్ కళాశాలల నుండి సుమారు 6 వేల మంది విద్యార్థులతోపాటు అనేక మంది క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొంటారు. బెక్ట గాన్ ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, క్రీడాకారులకు, సంస్కృతిక కళాకారులకు రూ 3లక్షల నగదుతో బహుమతులతోపాటు, ప్రశంశా పత్రాలు ప్రదానం చేస్తారు. రెండోరోజు జరిగే మ్యూజికల్ నైట్ సంగీత విభావరిలో సినీ సంగీతగాయని ,గాయకులు అనుదీప్, కీర్తన, సుమంత్, సమీరాలు పాల్గొంటారు. కళాశాల విద్యార్థులతోపాటు, ఆసక్తిగల ఇతర కళాశాలల విద్యార్థులు పాల్గొనాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, కార్యదర్శి మానం నాగేశ్వరరావులు తెలిపారు. తొలిరోజు టెక్నికల్, కల్చరర్, లిటరరీ ఈవెంట్స్ నిర్వహిస్తారు. రెండో రోజు సంగీత విభావరి, విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తారని బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నజీర్ వివరించారు.

ఏబిసి కెనాల్ పరిధిలోని ఆయకట్టుకు

15 వరకు నీరు ఇవ్వాలి: గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి

నాగార్జున సాగర్ కాలువ, ఏబిసి మరియు కొనంకి సబ్ డివిజన్ కెనాల్స్ పరిధిలోని ఆయకట్టుకు ఏప్రిల్ 15 వరకు నీటిని విడుదల చేయాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ డిమాండ్ చేశారు. చివరి ఎకరాకు కూడా నీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. గురువారం ఆయన మాట్లాడారు. మొక్కజొన్న, మిరప, పొగాకు, పంటలు చేతికొచ్చే దశలో ఉన్నాయని అన్నారు. ఈ దశలో సాగునీరు అందకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. కాలువల నిర్వహణ, ఎన్నెస్పీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే రైతాంగానికి ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పొలాలు చివరి దశకు వచ్చేసరికి నీరు అందడం లేదన్నారు.

బాపట్ల జిల్లాలోని నాగార్జున సాగర్ కాలువ-అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని కొనంకి సబ్-డివిజన్ కెనాల్స్ కింద లక్షలాది రూపాయలు పెట్టుబడులుపెట్టి సాగుచేసిన పొలాలు చివరి దశకు వచ్చేసరికి నీరు అందకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతూ ఒక్క తడికైనా వస్తే కనీసం పెట్టుబడులైనా దక్కుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు.

గతంలో కంటే తక్కువ ఎకరాలు సాగు చేస్తున్నా.. ఆరుతడి భూములకు నీరందక బీటలు వారుతున్నా.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని విమర్శించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ 18/0 మైలు వద్ద నిత్యం నీటిపరిమాణం 1400 క్యూసెక్కుల తగ్గకుండా 37/0 వద్ద 700ల క్యూసెక్కుల నీటి పరిమాణం ఉండేలా నీటిని విడుదల చేయాలని అన్నారు.



అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ఎన్నడూ లేని విధంగా నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలు పూర్తిగా నిండి నీరు సముద్రం పాలవుతున్న రైతులకు నీళ్ల అందించడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. మూడున్నరేళ్ల కాలం నుంచి కనీసం కాలువలపై జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకపోవడం ఈ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ప్రాజెక్టులు, కాలువలపై పర్యవేక్షణ లేని, ప్రజా అవసరాలపై అవగాహనలేని ఈ ముఖ్యమంత్రికి పాలించే హక్కులేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి హయాంలో నీటి నిల్వలు పూర్తి స్థాయిలో లేక కరువు పరిస్థితిలోనూ నీటిని సర్దుబాటు చేసి 32 టీఎంసీలు సాగుకి, 6 టీఎంసీలు తాగడానికి ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి హయాంలో అన్నదాతల అవసరాలకు అనుగుణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా సాగునీరు అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు.

ఐదు నెలల క్రితం గేటు విరిగినా నేటికీ గేటు ఏర్పాటు చేయకపోవడం వైసిపి ప్రభుత్వ వైఫల్యానికి నిలువుటద్దమన్నారు. ప్రాంతాలు, మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప చేసింది ఏమీ లేదని పేర్కొనారు. మూడు గేట్లు పెట్టలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు ఏం కడతాడని ప్రశ్నించారు. రైతాంగానికి సరిపడా నీరందించాలని, లేనిపక్షంలో రైతుల తరపున ఉద్యమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి హెచ్చరించారు.

బాలికపై వృద్ధుడు అత్యాచార యత్నం

ప్రజాశక్తి-చీరాల

బాలికపై కామాంధ వృద్ధుడు అత్యాచార యత్నం చేస్తుండగా స్థానికుల గుమిగూడటంతో అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండల పరిధిలోని ఈపూరుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పురుగుల పేటకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు అదే గ్రామానికి చెందిన 6 ఏళ్ల మైనరును స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్లోకి తీసుకువెళ్లి దుశ్చర్యకు పాల్పడుతుండటంతో స్థానికులు సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్నారు. దీంతో అతను అక్కడ నుంచి పరారయ్యాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కామాంధుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే పాపను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

బైకును తప్పించబోయి రెండు వాహనాలు ఢీ

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం పట్టణంలోని వై జంక్షన్‌లో రాంగ్ రూట్‌లో వస్తున్న బైకును తప్పించబోయి రెండు వాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కానీ కారు ముందుభాగం దెబ్బ తిన్నది. ఈ ప్రమాదం జరగడానికి కారణం రాంగ్ రూట్‌లో వచ్చిన ద్విచక్ర వాహనదారుడేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ద్విచక్ర వాహనాలు రాంగ్ రూట్‌లో నడపకుండా పోలీసులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

అన్న వితరణ

ప్రజాశక్తి-చీరాల

మండల పరిధిలోని ఈపూరుపాలెంలోని పద్మనాభునిపేట బాబా మందిరంలో ప్రతి నెల మొదటి గురువారం నిర్వహించే అన్న వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు ఇష్టంశెట్టి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి అవ్వారు తారక రామారావు, ట్రెజరరీ కాటూరి శ్రీనివాసరావు, అవ్వారు లక్ష్మి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బంగారం దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం మురుకుండపాడు గ్రామంలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో పనికి వచ్చి బంగారం దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ జి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన కేసు పూర్వాపరాలు విలేకరులకు తెలియజేశారు. ఫిర్యాది తల్లి స్నానం చేసేందుకు వెళ్లగా అదను చూసి పరుపు కింద పెట్టిన బంగారపు వస్తువులు దొంగిలించాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పనికి వచ్చిన చల్లా విజయ్‌పై అనుమానిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదుపై ఫిబ్రవరి 28న అనుమానిత వ్యక్తి అయిన చల్లా విజయ్ అదుపులోకి తీసుకొని విచారించగా చల్లా విజయ్ సదరు బంగారపు వస్తువులను తనే దొంగిలించినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి మూడు బంగారపు గాజులు, ఒక బంగారపు నాన్ తాడు మొత్తం 8.5 సవర్ల బంగారం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఎస్ఐ నాగశ్రీను, సిబ్బంది ఉన్నారు.

అదుపు తప్పిన బైకు
ఇద్దరు యువకులకు గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

బైకు అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండ లోని షెల్ పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. యువకులు బైకుపై శింగరాయకొండ నుంచి ఒంగోలు వైపు వెళ్తుండగా పెట్రోల్ బంకు వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరు రోడ్డుపై పడ్డారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులు శింగరాయకొండ మండలం మూలగుంటపాడు వెంకటేశ్వర కాలనీ యువకులుగా భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ పార్థసారథి

సచివాలయంలో ఆర్‌డిఒ పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు రెండో సచివాలయాన్ని గురువారం రేపల్లె ఆర్‌డిఒ పార్థసారథి తనిఖీ చేపట్టారు. ముందుగా వెల్లటూరు సచివాలయాన్ని సందర్శిస్తున్నట్లు సమాచారం అందించినప్పటికీ దానిని కాదని భట్టిప్రోలు-2 తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం ఇస్తుండటంతో రికార్డులలో ఉన్న అవకతవకలు సరిచేసుకుంటున్నారని, అందుకని సమాచారం లేకుండానే భట్టిప్రోలు-2ను పరిశీలించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. సిబ్బంది పనితీరు, సమయపాలన, హాజరు వంటి పలు అంశాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె సిడిపిఒ మాణిక్యం, కార్యదర్శి శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జి ఆర్‌ఐ శివరామకృష్ణ, విఆర్‌ఒ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



సచివాలయాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు

ప్రజలకు సకాలంలో సేవలు అందించాలి

తహశీల్దారు ప్రభాకరరావు

ప్రజాశక్తి-చీరాల

సచివాలయంలోని సిబ్బంది గ్రామ పరిధిలోని ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని రామకష్ణాపురం సచివాలయాన్ని తహశీల్దారు విజిట్ చేశారు. పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను ఆయన పరిశీలించి కార్యదర్శి కిరణ్ కుమార్‌తో కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పథకాల పంపిణీపై ఆరా తీశారు. అలాగే విధిగా మంజూరు జాబితాను సచివాలయంలో ప్రదర్శనగా ఉంచాలన్నారు. హౌసింగ్ నిర్మాణాలపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న వారిని గుర్తించి పనులు వేగవంతంగా ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రికార్డులు పరిశీలించి తగు సూచనలు అం దించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సహనం ఉండాలి

ప్రజాశక్తి-రేపల్లె

సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు సచివాలయ సిబ్బంది సహనంతో కూడిన సేవలను అందించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి విలియమ్స్ చెప్పారు. మండలంలోని చాట్రాగడ్డ గ్రామ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాల, సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రంను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలను చిరునవ్వుతో స్వాగతించి అర్జీలను స్వీకరించాలన్నారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సచివాలయం పరిధిలో పరిష్కారం పొందని సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారాలకు మార్గాలు చూపాలన్నారు. ప్రతి రోజూ జరిగే స్పందన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. సచివాలయాలలో నిర్వహించే పనుల వివరాలను రికార్డులలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. రికార్డులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించినా, అవకతవకలకు పాల్పడినా సహించేదిలేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ విజయేంద్ర, సచివాలయ, సివిల్ సప్లయ్స్ డిటి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలని

సిపిఎం నిరసన

ప్రజాశక్తి-రేపల్లె

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలని కోరుతూ స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్లో మోయలేని భారంగా గ్యాస్ బండ రేట్లు ఉన్నాయంటూ గ్యాస్ బండ మోస్తూ సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిత్యావసర ధరలు తగ్గిస్తామని హామీలు ఇచ్చి ఇప్పుడు రోజువారి పేదలు తిండితినే వాటికి సంబంధించిన గ్యాస్ ధర పెంపుదల చేస్తు పేద ప్రజల పొట్టగొట్టి కార్పొరేట్ అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలకు కానుకగా ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచారని విమర్శించారు. రాష్ట్రాల్లో ఎన్నికలు అయిపోగానే గ్యాస్ ధరలు పెంచడం కేంద్రానికి ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు. బిజెపి అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న గ్యాస్ ధర ఇపుడు సుమారు రూ.1200కు చేరింది. సాధారణ గ్యాస్‌పై రూ.50, కమర్షియల్ గ్యాస్‌పై రూ.350 పెంపుదల చేయటం ద్వారా పేదలు తినే ఆహార పదార్థాల ధరలు పెద్దఎత్తున పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జీఎస్టీ పేరుతో అన్ని రకాల ఆహార పదార్థాలు, పేదలు వాడే వస్తువుల మీద పన్నులు వసూలు చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఈ కాలంలో ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ముందు ధరలు అదుపు చేస్తామని ప్రకటన చేసి ఎన్నికలు అయిపోగానే ఇప్పుడు మరలా ధరలు పెంచుతుంది మోడీ మాటలు కేవలం ఎన్నికలో విజయాలు కోసమే అని పేదలపై ధరలు పెంపుదల చేయటం తన మిత్రులు అయినా రిలయన్స్



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు,కార్యకర్తలు

అంబానీ, అదాని లాంటివాళ్ల ఆస్తులు పెంపుదలకు సహకరిస్తున్నాడని విమర్శించారు. వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండటంతో సామాన్యులు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ విధానాలతో దేశంలో ఆర్థిక సంక్షోభం నెలకొన్నదని, అసమానతలు, నిరుద్యోగం పెరిగి సామాన్యుడి కొనుగోలు సామర్థ్యం అట్టడుగు స్థాయికి పడిపోయిందని అన్నారు. గ్యాస్‌బండ ప్రియం కావటంతో హెూటళ్లలో మెనూల ధరలు మారిపోయే అవకాశం ఉందన్నారు. రోడ్డు వెంట ఉండే సాధారణ బండి దుకాణం నుంచి స్టార్ హెూటళ్ల వరకు గ్యాస్ ధర పెంపు ప్రభావం పడనుందని పేర్కొన్నారు. పేదలు పై భారాలు వేస్తున్నా బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు గట్టిగా మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రేపల్లె వై కిషోర్ బాబు, జి దానియేలు డి బాబురావు, డి శ్రీనివాసరావు, ఎల్ వెంకట్, ఎం సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-పంగులూరు

శాసనమండలి ఎన్నికల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు, సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం మండలంలోని చందలూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శాసనమండలిలో ప్రజా సమస్యలపై మాట్లాడాలంటే, పిడిఎఫ్ సభ్యులు ఉండాలని అన్నారు. గత 18 సంవత్సరాల నుంచి శాసనమండలిలో అనేక సమస్యల గురించి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాట్లాడారని అన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సామాన్య ప్రజల కోసం, నిరుద్యోగ యువత కోసం, ఉద్యోగుల కోసం, వారి హక్కుల కోసం, నికరంగా పోరాడిన చరిత్ర పిడిఎఫ్ ఉందని రాయిని వినోద్ బాబు, మల్లారెడ్డి అన్నారు. ప్రలోభాలు పెట్టి ఓట్లు దండుకొని, సీట్లు కాజేసి అధికారాన్ని ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకోవాలని అధికారపక్షం ప్రయత్నిస్తుందని విమర్శించారు. విజ్ఞానవంతులు, మేధావులు ఉండే సభలో రాజకీయాలకతీతంగా పనిచేసే పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ అభ్యర్థి బాబురెడ్డిని గెలిపించాలని కోరారు.

ప్రజావసరాలను ఫణంగా పెట్టి

ఐటిసి కోసం హడావుడి నిర్ణయం

ప్రతి రోజూ 3లక్షల 20 వేల లీటర్ల తాగునీరు ఇచ్చేందుకు చీరాల మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం ● తాగునీటి ఎద్దడి ఏర్పడితే ఇబ్బందులు

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

చీరాల ఐటిసి కంపెనీ వారు తమ రోజు వారీ అవసరాల కోసం మున్సిపాలిటి నుంచి 3 లక్షలకు పైగా తాగునీరు కావాలని చీరాల పురపాలక సంఘాన్ని కోరారు. రోజువారి ప్రజావసరాలతో ముడిపడి ఉన్న తాగునీటి సరఫరా అంశం గురించి సాధ్యాసాధ్యాలు, భవిష్యత్‌లో వచ్చే ఇబ్బందుల గురించి కూలంకషంగా చర్చించి ఒక నిర్ణయం తీసుకోవలసిన మున్సిపల్ కౌన్సిల్ హడావిడిగా ఐటిసి వారికి తాగునీరు ఇచ్చేందుకు ఆమోదం తెలపడం విమర్శలకు తావిచ్చింది. స్థానిక ఐటిసి వారు తమ కంపెనీలో 2 వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని, కంపెనీ నిర్వహణలో ప్రాసెసింగ్, డ్రింకింగ్, కుకింగ్, ఇతర అవసరాల కోసం ప్రతి రోజూ 3 లక్షల 20 వేల లీటర్ల నీటిని తమ కంపెనీ ఆవరణలో ఉన్న బావుల ద్వారా వినియోగిస్తున్నామని, కాని సదరు నీటిలో టిడిఎస్ పెరగడం వలన ఈ నీరు ఉపయోగపడడం లేదని తెలిపారు. అందువలన చీరాల పురపాలక సంఘం ద్వారా ప్రతి రోజూ 3 లక్షల 20 వేల లీటర్ల నీటిని తమకు సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు పురపాలక సంఘ బైలా ప్రకారం చెల్లించవలసిన చార్జీలను చెల్లిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం రాగా ప్రజల అవసరాలతో ముడిపడి ఉన్న ఈ అంశం గురించి అన్ని విధాలా కూలంకషంగా చర్చించి నిర్ణయం తీసుకోవలసిన అధికార పక్ష కౌన్సిల్ సభ్యులు ఇదేదో అత్యవసర అంశంలాగా ఆమోదం చెప్పారు. కౌన్సిల్‌లో ప్రతిపక్ష సభ్యులు వద్దు అన్నారు కనుక తాము ఆమోదిస్తాం అన్నట్లుగా చేశారు. ఒక దశలో ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఈ అంశాన్ని వాయిదా వేసి కూలంకషంగా చర్చించి వచ్చే సమావేశంలో ఒక నిర్ణయం తీసుకుందామని అన్నప్పటికీ అధికార పక్ష కౌన్సిలర్లు వాయిదాకు వెళ్లకుండా ఆమోదం తెలిపారు. ఇలా



చీరాల మున్సిపల్ కార్యాలయం

హడావిడిగా అంశాన్ని ఆమోదించడం వెనుక ఆర్థిక ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న ప్రచారానికి ఊతం ఇచ్చినట్లయింది. అసలు ప్రతి నెల జరిగే కౌన్సిల్ సమావేశం ముందు అధికారపక్ష కౌన్సిలర్లు సమావేశమయి ముఖ్యమైన అంశాల గురించి చర్చించి సమిష్టిగా నిర్ణయాలు తీసుకావాలి. కాని ఈ సాంప్రదాయాన్ని ప్రస్తుత అధికార పక్ష కౌన్సిల్ సభ్యులు పాటిస్తున్న పరిస్థితి లేదు. ఈ కారణంగా పలు అంశాలపై కౌన్సిల్ సమావేశంలో వారిలో వారే వాదోపవాదాలకు దిగడం పరిపాటి అయింది. ఐటిసి వారికి తాగునీరు సరఫరా విషయంలో కూడా తమ మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ కౌన్సిల్‌లో పెత్తనం చేస్తున్న ఇద్దరు, ముగ్గురు అధికార పక్ష కౌన్సిలర్ల అభిప్రాయం పరోక్షంగా ఎమ్మెల్యే చెప్పిన మాటగా చెబుతున్నందున మిగతావారు మనకెందుకులే అన్నట్లుగా ఉంటున్నారు. ఈ కారణంగా చర్చించి నిర్ణయాలు తీసుకోవాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలు ఆమోదానికి వెళ్లి వివాదం అవుతున్నాయి. ఇలా పట్టణ ప్రజానీకం అవసరాలను ఫణంగాపెట్టి ఐటిసికి మంచినీటిని సరఫరా చేయడం వలన భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయని తెలుస్తుంది. చీరాల పట్టణానికి తాగునీరు సరఫరా చేసే రక్షిత చెరువు పూర్తి నీటి సామర్థ్యం 22 అడుగులు ఉంటే 1,450 మిలియన్ లీటర్ల నీరు నిల్వ ఉంటుంది. ప్రస్తుతం దాదాపు చెరువు నిండుగానే ఉంది. కొమ్మమూరు కాలువలో నీరు ప్రవహిస్తున్నంత వరకు చెరువుకు నీటి సరఫరా ఉంటుంది. మున్సిపల్ అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం ప్రతి రోజూ పట్టణ ప్రజల నీటి అవసరాల కోసం 7 మిలియన్ లీటర్ల నీరు అందిస్తున్నారు. ఐటిసి వారు అడుగుతున్నది రోజుకు 0.32 ఎమ్ఎల్‌లు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీరు 4 నెలల పాటు వస్తాయి. చాలా కాలంగా వర్షాలు పడటం లేదు. కొమ్మమూరు కాలువకు కూడా నీటి సరఫరా నిలిచిపోతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే జూలై నాటికి చెరువులో నీరు అడుగంటుతాయి. మళ్లీ వర్షాలు దండిగా కురిసి పైన సాగర్ డ్యామ్ నిండి, కృష్ణా నదిలో నీటి ప్రవాహం వస్తేనే కొమ్మమూరుకు నీటి సరఫరా జరుగుతుంది. ఈ వేసవిలో ప్రజల నీటి వినియోగం పెరుగుతుంది. చెరువులో నీరు కూడా అధిక ఉష్ణోగ్రతలకు ఆవిరి అవుతుంది. ఒకవేళ వర్షాలు పడకపోతే నీటి ఎద్దడి వస్తుంది. అప్పుడు పట్టణ ప్రజలకు ఒక పూట నీరు ఇవ్వడం కూడా గగనమవుతుంది. అప్పుడు ఐటిసి కంపెనీకి నీరు ఇవ్వడం వల్లనే చెరువులో నీరంతా అయిపోయాయని ప్రజలంటారు. అధికార పక్షం దగ్గర జవాబు ఉండదు. ప్రజలతో ముడిపడి ఉన్న అంశాలపై అన్ని విధాలా ఆలోచించాలి. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. అంతిమంగా ప్రజలకు జవాబుదారిగా ఉండాలి. కాని ఐటిసి కంపెనీ కోసం హడావుడి నిర్ణయాలు భవిష్యత్‌లో ఇబ్బందులను కొనితెస్తాయి. ఐటిసి కంపెనీ దేశంలోనే అతి పెద్ద కంపెనీ. వారు కావాలంటే కృష్ణా నది నుంచి లేదా కొమ్మమూరు కాలువ నుంచి నేరుగా పైప్‌లైన్ నిర్మించుకొని తమకు కావలసిన నీరు రాబట్టుకోగలరు. పురపాలక సంఘానికి సొమ్ములు వస్తాయనో లేక మొహమాటానికి పోయి రోజుకు 3 లక్షల 20 వేల లీటర్ల మంచినీరు మున్సిపాలిటీ నుంచి సరఫరా చేసే విషయమై కౌన్సిల్ పునరాలోచన చేయాల్సి ఉంది.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి



కొండపిలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కొండపి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కెజి. మస్తాన్ కోరారు.. పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండల పరిధిలోని గోగినేనివారిపాలెం గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కెజి. మస్తాన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.బాబురెడ్డికి మొదటి ప్రాధ్యానత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.వందనం తదితరులు పాల్గొన్నారు. **ఒంగోలు కలెక్టరేట్ :** పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పోక్కిరెడ్డి బాబురెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఒంగోలు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు పిడిఎఫ్ ప్రచార కమిటీ నియోజకవర్గ కన్వీనర్, విశ్రాంత ప్రిన్సిపల్ ఎవి. పుల్లారావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 150 ఉద్యోగ. ఉపాధ్యాయ. కార్మిక కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, విశ్రాంత ఉద్యోగ, నిరుద్యోగ. ప్రజాసంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థులకు సంఘీభావం ప్రకటించిన సంఘాల బాధ్యులందరూ దళాలుగా ఏర్పడి నగరంలోని 50 డివిజన్‌లో విస్తతంగా పర్యటిస్తున్నారన్నారు. ఒంగోలు రూరల్ మండలం కొత్తపట్నం మండలంలో అన్ని గ్రామాలలో పిడిఎఫ్ అభ్యర్థులు ప్రచార దళాలు పర్య టిస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు విద్యాసంస్థలు. ప్రైవేట్ రంగ సంస్థలు .హాస్పిటల్స్, పరిశ్రమలు లోని సిబ్బందిని కలుస్తూ. ప్రచారం చేస్తున్నారన్నారు. వివిధ వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నట్టు పుల్లారావు తెలిపారు.



అడకా స్వాములును అభినందిస్తున్న బిఎన్. విజయ్‌కుమార్

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా స్వాములు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన అడకా స్వాములు నియమితులయ్యారు. ఈ సందర్భంగా టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే విజయ్ కుమార్‌ను స్థానిక రాజీవ్ నగర్ లోని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల నేతగా, బిసి సంఘం నాయకులుగా అడకా స్వాములు మంచి గుర్తింపు పొందారన్నారు. తెలుగుదేశం పార్టీ బిసిలకు సముచిత స్థానం కల్పించడంలో ఎల్లవేళలా ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మద్దిపాడు మండల అధ్యక్షులు మండవ జయంతి బాబు, రాష్ట్ర మహిళా నాయకురాలు టి.అనంతమ్మ, సర్పంచి పి.సుబ్బారావు, వి.శ్రీనివాసరావు, రామాంజనేయులు, సురేష్, వెంకట్రావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రమణారావును పరామర్శిస్తున్న మీడియా ప్రతినిధులు

బాధితుడికి పరామర్శ

చీమకుర్తి : సూర్య విలేకరి రమణారావును సంతనూతలపాడు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు గురువారం పరామర్శించారు. రమణారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రస్తుతం ఇంటి వద్దే చికిత్స పొందుతున్నాడు. అందులో భాగంగా మీడియా ప్రతినిధులు పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు గొల్లపూడిహరి, బొడ్డపాటి వాసు,బెజవాడ హరి,దొంతు సుధాకర్,పల్లపాటి చంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణారావు

రాయితీపై కంటి వైద్యం

కృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ కష్ణారావు

ఒంగోలు కలెక్టరేట్ : గ్లాకోమా వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 12 నుంచి 18 వరకూ స్థానిక సుందరయ్య భవన్ రోడ్‌లోని కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కంటి వైద్యంపై ఉచిత ఓపి, రాయితీపై కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ ముండ్లమూరి కష్ణారావు పేర్కొన్నారు. ప్రముఖ కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ వి సౌమ్య ఆధ్వర్యంలో కుట్లు, నొప్పి లేని ఫ్యాకో మిషన్ ద్వారా కంటి శుక్లం ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. డయాబెటిక్ రెటినోపతి, మెడికల్ రెటీనా, గ్లాకోమ సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ముండ్లమూరి అంజయ్య మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు రాయితీపై అతి తక్కువ ధరలకే నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశ్నాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


పన్నులు చెల్లించండి : కమిషనర్

ఒంగోలు సబర్బన్ : ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను, నీటిపన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు కోరారు. పన్నుల వసూళ్లలో భాగంగా 38వ డివిజన్ సూజాత నగర్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారత్ పెట్రోలియం పంప్ ఏరియాలలో గురువారం కమిషనర్ పర్యటించారు. పన్నులు బకాయిలు ఉన్నవారితో నేరుగా మాట్లాడారు. కమిషనర్ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాత, సచివాలయ సిబ్బంది ఉన్నారు. అనంతరం 35వ డివిజన్ పరిధిలోని లాయర్‌పేట సచివాలయాన్ని కమిషనర్ సందర్శించారు. పన్నుల వసూళ్లపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్యా, కార్పొషన్ ఇంజినీర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

భూసర్వే సక్రమంగా నిర్వహించాలి

యర్రగొండపాలెం : మండల పరిధిలోని కొలుకుల గ్రామంలో చేపట్టిన జగనన్న భూరక్ష భూ సర్వేను సక్రమంగా నిర్వహించాలని తహశీల్దారు రవీంద్రారెడ్డి తెలిపారు. కొలుకుల గ్రామంలో గురువారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రవీంద్రారెడ్డి మాట్లాడుతూ భూసర్వేలో రైతులకు సంబంధించి హద్దు రాళ్లను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సైదారావు, ఆర్ఐ రామకృష్ణ, విఆర్వో కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వరలక్ష్మమ్మ కనకాభిషేక మహోత్సవం



వరలక్ష్మమ్మను సన్మానిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి పొదిలి

పొదిలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునుపూడి చందు సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గునుపూడి గునుపూడి భాస్కర్, వ్యాపాం వేత్త గునుపూడి మధుసూదన్ రావు మాతృమూర్తి, పొదిలి ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, శ్రీ వాసవీ కళ్యాణ్ సదన్, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత గునుపూడి సుబ్బారావు ధర్మపత్ని గునుపూడి వరలక్ష్మమ్మకనకాభి షేక మాత పూజా మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గునుపూడి సోదరులు, కుటుంబ సభ్యులను వరలక్ష్మమ్మను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక వాసవీ కళ్యాణ సదన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, గునుపూడి అభిమానులు, వరలక్ష్మమ్మను సత్కరించారు. ఈ సందర్భంగా గిద్దలూరు అన్నావెంకట రాంబాబు మాట్లాడుతూ ఈ సష్టిలో అత్యంత విలువైనది, కొలవలేనిది అమ్మ ప్రేమ ఒక్కటే నని తెలిపారు. అమ్మ చల్లనైన దీవెనలను ప్రతి ఒక్కరూ తీసుకోవడం ద్వారా వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. మాజీ ఎమ్మెల్యే కందులనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, టిడిపి అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం, టిడిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఆర్‌డిఒ సందీప్‌కుమార్

ప్రజాశక్తి- కురిచేడు

అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడాలని కనిగిరి ఆర్‌డిఒ సందీప్ కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత మండల పరిధిలోని నమశ్శివాయపురం, బోధనంపాడు, పడమర నాయుడుపాలెం గ్రామాలను సందర్శించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల వారీగా అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అధికారులకుఏ తగు సూచనలు చేసి ప్రజలు ఇబ్బంది పడకుండా వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నాగుల్ మీరా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుబ్బారావు గుప్తా బాలినేని అనుచరుడే

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్ వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

సుబ్బారావు గుప్తా ముమ్మాటికీ వైసిపి రెబల్ కార్యకర్తేనని, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి అనుచరుడేనని, గుప్తాకు జనసేన పార్టీకి ఎలాంటి సంబంధం లేదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ స్పష్టం చేశారు. జనసేన జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుబ్బారావు గుప్తాపై కేసు పెట్టడం చూస్తేంటే ఒంగోలులో ప్రశ్నించిన వారిమీద కేసులు పెట్టడం సర్వసాధారణంగా మారిందన్నారు. సుబ్బారావు గుప్తా జనసేన పార్టీ కార్యకర్త అని వైసిపి వారు ప్రచారం చేస్తున్నారని, ఆయనకు, తమ పార్టీకి ఎలాంటి సంబంధమూ లేదన్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి 1999 ఎన్నికల్లో పోటీ చేయకముందు నుంచే సుబ్బారావు గుప్తా బాలినేని శ్రీనివాసరెడ్డికి అనుచరుడిగా ఉన్నాడని గుర్తు చేశారు. 1999 ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి పోటీ



మాట్లాడుతున్న రియాజ్

చేసినప్పుడు సుబ్బారావు గుప్తా డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు తెలిపారు. బాలినేని శ్రీనివాసరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గుప్తాను ఆంజనేయస్వామి దేవస్థానం గుడి చైర్మన్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. గుప్తా జనసేన పార్టీ కార్యకర్తని సోషల్ మీడియాలో వైసిపి నేతలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.

ఈనెల 14న జనసేన పార్టీ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగే ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కోరారు. తాము ఎంతో బలంగా ఉన్నామని చెప్పుకుంటున్న టిడిపి, వైసిపి పార్టీలు రాజకీయ లబ్ధికోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్లెక్సీలలో జనసేన అధినేత పవన్ కళ్యాన్ బొమ్మ, మెగస్టార్ చిరంజీవి బొమ్మ పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఇది ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇది వారి రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని చెప్పారు. ఇటీవల ఒంగోలులో కూడా వైసిపి, టిడిపి వాళ్లు పవన్ కళ్యాణ్, చిరంజీవి బొమ్మ పెట్టుకొని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. రాజకీయ అవసరాల కోసం మెగా కుటుంబాన్ని వాడుకోవడాన్ని తాము ఖండిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెం ప్రసాద్, నగర పార్టీ అధ్యక్షుడు మలగా రమేష్, నగర నాయకులు ఈదుపల్లి గిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలను అలంకరించాలి

ప్రజాశక్తి-కనిగిరి

ఉత్తమ ఫలితాలతో ఉన్నత స్థానాలను అలంకరించాలని వ్యాపారవేత్త నాదెండ్ల తిరుపతిరావు తెలిపారు. మండల పరిధిలోని పాతపాడు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వతరగతి విద్యార్థులకు వీడ్కోలు, వార్షికోత్స వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుంచి 42 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లు సాధించేలా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చేసిన కృషి అభినందనీయమన్నారు. పదవతరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లితండ్రులకు,ఉపాధ్యాయులకు, సొంత ఊరికి మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈఏడాది ట్రిపుల్ఐటి సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థులకు రూ.10వేల సహాయం అందిస్తానని షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పరపు గురుబ్రహ్మం పాఠశాలకు రూ. 10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అట్లా రామచంద్రారెడ్డి, సర్పంచి నేలటూరి రమణమ్మ, ఎస్ఎంసి చైర్మన్ అట్లా పిచ్చిరెడ్డి, ఎంఇఒ ప్రసాద్‌రావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

కళాశాల వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 4వ వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపల్ షేక్‌మహబూబ్‌బాషా అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దోర్నాల ప్రభుత్వ జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకులు కెవి.సుబ్బారెడ్డి పరీక్షలపై అగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు షాలేము రాజు, శ్రీధర్, సంజీవ్, రామకృష్ణ, వెంకటయ్య, గాలెయ్య, గ్రామపెద్ద కాసు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి-పొన్నలూరు

మండల పరిధిలోని శింగరబొట్లపాలెం గ్రామ సచివాలయాన్ని ఎస్.దాసరిరాజారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ మహిళా పోలీస్ గిరిజా పనితీరుపై ఎస్ఐ సమీక్షించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ సచివాలయ మహిళా పోలీసులు క్రమశిక్షణతో, అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



తాడులాగుడు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

స్థానిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లోని ప్రీ ప్రైమరీ విద్యార్థులకు గురువారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు ఈ కార్యక్రమానికి వ్యాయామ ఉపాధ్యాయుడు ఓగుబోయిన శ్రీనివాసులు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వ్యాయామం, స్పోర్ట్స్ వల్ల జరిగే ప్రయోజనాల గురించి విద్యార్థులు తెలియచెప్పారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్, అకాడమిక్ డీన్ శ్రీనివాసరావు ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి శంషాద్, ప్రైమరీ ఇన్‌ఛార్జి, అమరవేణి, ఎఒ మధు, వ్యాయామ ఉపాధ్యాయులు వేణు, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గీతారాణి

విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి -శింగరాయకొండ


విద్యార్థులకు ప్రస్తుత సమయం చాలా కీలకమైనదని ప్రతి నిమిషం విలువగా వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చునని పిఎన్‌సిఎ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతా రాణి తెలిపారు. పిఎన్‌సిఎ జూనియర్ కళాశాలలో గురువారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి మాట్లాడుతూ పరీక్షలకు రోజులు దగ్గరపడ్డాయని ప్రతి నిమిషం చాలా విలువైందిగా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చునని తెలిపారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులు సాధించాలని ఆమె ఆకాక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండల పరిధిలోని ఊళ్లపాలెం మత్స్యకారుల సమస్యలను పరిష్కరి స్తామని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. ఊళ్లపాలెం సర్పంచి పాకనాటి అనసూయమ్మ, వైసిపి నాయకుడు పాకనాటి సుబ్బారెడ్డి నివాసానికి అశోక్‌బాబు గురువారం వెళ్లారు. ఈ సందర్భంగా మత్స్య కారులు అక్కడికి వచ్చి తమ గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం తెలిపారు. దూర ప్రాంతానికి చెందిన బోట్లు ఇక్కడకు వచ్చి చేపలను కూడా పట్టు కుపోతున్న అధికారులకు పట్టడం లేదన్నారు. దీంతో స్పందించిన అశోబాబు మత్స్యశాఖ జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లా డారు. మత్స్యకారుల సమస్యలు పరిష్క రించక పోతే ఊళ్ల పాలెం నుంచి ఒంగోలు వరకు పాదయాత్ర చేస్తానని హెచ్చరించారు. అనంతరం సర్పంచి అనసూర్యమ్మ ఆధ్వర్యంలో వరికూటి అశోక్ బాబు ఆయన సతీమణి లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి యన్నాబత్తిన మురళి, ఆరేటి లక్ష్మీనారాయణ, తన్నీరు సుబ్బారావు, షేక్ రియాజ్, మత్స్యకార గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌బాబు

కాటంరాజు గంగా భవానీ

ఆలయ కమిటీ చైర్మన్‌గా పిఎల్‌పి యాదవ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

కాటంరాజు గంగా భవానీ ఆలయ అభివృద్ధికి యాదవ సోదరులందరూ తమ వంతు సహాయ సహకారాలు అందిచాలని కాటంరాజు గంగా భవానీ ఆలయ కమిటీ నూతన చైర్మన్ పిఎల్‌పి. యాదవ్ కోరారు. స్థానిక నెహ్రూబజార్ లోని సాయి ఫంక్షన్ హాలులో జిల్లా స్థాయి యాదవ సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. ఈ నెల 21న కాటమరాజు తిరునాళ్ల సందర్భంగా ఏర్పాట్లు , వివిధ సాంస్కతిక కార్యక్రమాల, బందోబస్తు, మంచినీటి, భోజన వసతి తదితర ఏర్పాట్లు గురించి చర్చించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా అన్ని, ఏర్పాటు నిర్వహించాలని కమిటీ తీర్మానించింది. అనంతరం శ్రీ కాటమరాజు గంగాభవానీ దేవాలయ కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా పిన్నిక లక్ష్మి ప్రసాద్ యాదవ్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మంగమూరి పోలయ్య యాదవ్, పల్లెబోయిన వెంకటరాజు యాదవ్, పాముల పోలరాజు యాదవ్, గుమ్మ గంగరాజు యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, మేకనబోయిన గురు ప్రసాద ్యాదవ్, మల్లేష్ యాదవ్, రాజారావు యాదవ్, అల్లం శ్రీనివాస్ యాదవ్, బోరిగొర్ల గాలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పిఎల్‌పి యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు



రామకృష్ణారెడ్డికి పూల బొకే అందజేస్తున్న నాయకులు

రోటరీ సేవలు వినియోగించుకోండి

రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాలే రంగారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 118 సంవత్సరాల చరిత్ర కలిగిన రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలలో పలు రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 పరిధిలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉచితంగా కత్రిమ కాళ్ళు, చేతులు అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ కేంద్రాలు, ఉచిత కంటి ఆపరేషన్లు, బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్టు డాక్టర్ కళ్యాణ్, హెచ్‌పి గ్యాస్ కంపెనీ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, హుస్సేన్ నూతనంగా రోటరీ క్లబ్‌లో సభ్యత్వం పొంది సేవలు అందించేందుకు ముందుకొచ్చారు. శింగరాయకొండ మండలంలో రోటరీ క్లబ్ సేవలు బలోపేతం చేస్తామని అధ్యక్షుడు మాలే రంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెట్టి సూర్య చంద్ర శేఖర్ రెడ్డి, నాగసూరి వెంకట సుబ్బారావు, కార్యదర్శి పంతగాని వెంకటేశ్వర్లు,కోటపాటి నారాయణ, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం సోమ రాజుపల్లి పంచాయతీ పరిధిలోని పకీరుపాలెంకు గహ సారథి షేక్ దాదాసాహెబ్ నివాసానికి వైసిపి కొండపి వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు గురువారం వచ్చారు. ఈ సందర్భంగా పకీరుపాలెంకు చెందిన మహిళలు అశోక్‌బాబను కలిశారు. తమ కాలనీలో సమస్యలు ఉన్నాయని, ఎవరికి చెప్పినా పట్టించు కోవడం లేదన్నారు. వీధిలైట్లు వెలగక ఇబ్బంది పడుతు న్నామన్నారు. మురుగుకాలువలు శుభ్రం చేయక పోవడంతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు, నాయకులు అనేక సార్లు విన్నవించినా చూసి పోతున్నారు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదని తెలిపారు. స్పందించిన అశోక్‌బాబు పంచా యతీ రాజ్ ఎఇ కోట శ్రీహరికి ఫోన్ చేసి పకీరుపాలెంలో మురుగు కాలువల సమస్యలు పరిష్కరిం చాలని సూచిం చారు. రూ.10 లక్షల వ్యయంతో త్వరలో పనులు చేపడతామని ఆయన వివరించారు. అనంతరం వైసిపి కార్యకర్తలతో సమావేశమై పలు విషయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు ,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి , యన్నాబత్తిన వెంకటేశ్వరం ావు, మాజీ ఎంపిపి యన్నాబత్తిన మురళి, షేక్ సలీం బాషా , షేక్ పటేల్, షేక్ అబ్దుల్లా ,సచివాలయాల కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, ఊళ్ల పాలెం సర్పంచి పాకనాటి అనసూయమ్మ ,వరికూటి లక్ష్మి గాలి బుజ్జి, రాయి పేర్రాజు, డాక్టర్ యన్నాబట్టిన కార్తీక్ , షేక్ సుల్తాన్ , పిట్టా బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నీళ్లు కూడా లేకుండా గృహ నిర్మాణం ఎలా?

ప్రజాశక్తి-భట్టిప్రోలు

గృహం నిర్మించాలంటే ఇనుము, కంకర, సిమెంట్ కంటే కూడా ప్రధానమైనది నీళ్లు. నీళ్ల లేకపోతే ఎన్ని రకాల మెటీరియల్ ఉన్నప్పటికీ ఉపయోగం ఉండదు. అలాంటి నీటి కొరత భట్టిప్రోలు జగనన్న కాలనీలో నెలకొంది. ఇల్లు కట్టుబడికి ఒక్కో డ్రమ్ము వంద రూపాయలు వెచ్చించి దూర ప్రాంతం నుంచి తెచ్చుకుంటున్నారు. ప్రతిరోజూ బేస్మెంట్ పూర్తయ్యేంత వరకు రోజుకు 500 రూపాయల వరకు నీటి కొరకు వేచిస్తున్నామని, గోడలు తడుపుకోవటానికి మరో ఐదు వందలతో నీటిని కొనుగోలు చెయ్యాల్సిన దుస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు వాపోతున్నారు. భట్టిప్రోలులో ఉన్న మూడు లేవుట్‌లలో దాదాపు 1120 మందికి నివేశాన స్థలాలు కేటాయించారు. దీనికి గాను 33 ఎకరాల భూమిని ఎకరా రూ.32 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. కానీ ఎలాంటి భూగర్భ జలాలు లేని కాలనీలో లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు అవసరమైన నీటి సరఫరాను అందించటంలో అధికారులు విఫలం చెందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం జగనన్న కాలనీకి కేటాయించిన రూ.10 లక్షల నిధులతో నీటి సమస్య తీర్చాలని ముందుగా అధికారులు భావించినా ఆ మేరకు ఏ ఒక్కరూ టెండరు వేయటానికి ముందుకు రాకపోవటంతో ఆ నిధులు కాస్తా వెనుదిరిగాయి. దీంతో ఉన్నతాధికారుల ఒత్తిడి కారణంగా మండల పరిషత్ నుంచి రూ.5 లక్షలు కేటాయించడంతో



నీటి డ్రమ్ములతో ఇల్లు కట్టుబడి

వెల్లటూరు ఛానల్ వద్ద బోర్లు ఏర్పాటు చేసి పైపు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఆ ప్రాంతంలో కూడా బోర్లకు నీరు రాకపోవటంతో కేటాయించిన నిధులు మట్టిపాలయ్యాయి. చేసేదేమీ లేక లబ్ధిదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని గతేడాది గ్రామ పంచాయతీ నుంచి మరో లక్ష కేటాయించి సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా కొరకు పైపులైన్ నిర్మించారు. కానీ మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేయాల్సిన పైపులైను నిర్మాణం పూర్తికాకపోవటంతో పంచాయతీ నిధులు నిరుపయోగమయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ సకాలంలో పైపులైన్ నిర్మాణం చేపట్టకపోవడం వలన గృహ నిర్మాణానికి నీటిని కొనుగోలు చేసుకోవలసిన అగత్యం ఏర్పడిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ఒత్తిడితో ఖంగుతింటున్న దిగువ స్థాయి అధికారులు

గృహ నిర్మాణాలు వేగవంతం చేసి ప్రతి రోజూ ఎన్ని ప్రారంభించారో ప్రగతి చూపించాలని, లేకుంటే సస్పెండ్ చేస్తామని ఉన్నతాధికారులు చేస్తున్న ఒత్తిడితో దిగువ స్థాయి అధికారులు ఖంగుతింటున్నారు. లబ్ధిదారులతో దగ్గర సంబంధాలు ఉన్న ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఎవరికి వారు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తే మా మాట ఎవరు వింటారని కింది స్థాయి అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు భట్టిప్రోలులో సుమారు వంద గృహాలకు మించి నిర్మాణ పనులు చేపట్టలేదు. బేస్మెంట్ వేసుకున్నవారికి కూడా సకాలంలో బిల్లులు మంజూరు కావడం లేదని వ్యాఖ్యానిస్తున్నారు. బిల్లులు రాకపోతే అప్పులుచేసి మరీ గృహాలు నిర్మించుకోవటం తమ వల్లకాదని పలువురు పేర్కొంటున్నారు.

ముఖ్యంగా స్థలాల భూమి లోతట్టు ప్రాంతం కావటం, భూగర్భ జలాలు లేకపోవటంతో లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రావడంలేదని స్పష్టమవుతోంది. మరో మూడు నెలలు గడిస్తే వర్షాలు ప్రారంభమవుతాయని, అప్పుడు మరలా అర్ధాంతరంగా పనులు నిలిచిపోతాయని, దీని దృష్ట్యా ఉన్నతాధికారులు స్పందించి గృహాలు నిర్మించాలని ఒత్తిడి చెయ్యటం కంటే ముందు అందుకు అవసరమైన వసతులు ఏర్పాటు చేస్తే అప్పో సప్పో చేసుకుని గృహాలు నిర్మించుకుంటామని లబ్ధిదారులు చెపుతున్నారు.

సమిష్టి కృషితో తిరునాళ్ల విజయవంతం

ప్రజాశక్తి-అద్దంకి

అందరూ సమిష్టి కృషి చేస్తే తిరునాళ్ల విజయవంతం అవుతుందని చీరాల ఆర్‌డిఒ సరోజిని పేర్కొన్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు సింగరకొండ తిరునాళ్ల జరగనున్న నేపథ్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింగరకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో చీరాల ఆర్‌డిఒ సరోజిని గురువారం అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి విజయ వంతం చేయాలని కోరారు. డిఎస్‌పి శ్రీకాంత్ మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల రోజు సాయంత్రం నుంచి హైదరాబాద్ నుంచి అద్దంకి వైపు వచ్చే వాహనాలను నరసరావుపేట వైపునకు, మేదరమెట్ల వైపు నుంచి అద్దంకి వైపు వచ్చే వాహనాలను కొరిశపాడు ఎన్ హెచ్ 16 రోడ్ వైపునకు దారి మళ్లించనున్నట్లు తెలిపారు. ప్రభలను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకుల పూర్తి ఆధారాలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని ప్రభలపై ఎలాంటి పార్టీలకు



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సరోజిని, చిత్రంలో సింగరకొండ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోటా శ్రీనివాసరావు

సంబంధిన ఫ్లెక్సీలు, పాటలు ఉండరాదని అన్నారు. పబ్లిక్ ప్రదేశాలు, ప్రభల వద్ద బాణ సంచాలు కాల్చరాదని, డప్పు వాయిద్యాలు వాయించరాదని తెలిపారు. ముఖ్యంగా ప్రభలపై అశ్లీల నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదని, అలా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ ఈఈ మస్తాన్‌రావు మాట్లాడుతూ తిరునాళ్ల మూడు రోజులు విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సిఐ రోశయ్య మాట్లాడుతూ తిరునాళ్లలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌పై ప్రత్యేక టీమ్‌లతో పోలీస్ నిఘా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్లకు వచ్చే వాహనాల పార్కింగ్ కోసం సింగరకొండపాలెం వైపు ఒక పార్కింగ్, 99 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహానికి దక్షిణం వైపు నామ్ రోడ్‌కు ఇరువైపులా రెండు పార్కింగ్‌లు, సింగరకొండ పాలెం వైపు ఒక పార్కింగ్ మొత్తం 4 పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆ పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుత్ ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను కోరారు. ఈ సమన్వయ సమావేశంలో దర్శి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు, అబ్కారీ శాఖ ఎస్ఐ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారులు, ఎస్‌ఐలు, అగ్నిమాపక శాఖ అధికారులు, ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు,ె ంవెన్యూ అధికారులు, ప్రసన్నాంజనేయ స్వామి, లక్ష్మి నృసింహ స్వామి ఆలయాల కార్యనిర్వహణాధికారి టి సుభద్ర, కోటిరెడ్డి, చైర్మన్‌లు కోట శ్రీనివాస్ కుమార్, ఎన్ కొండలు, ఐఅండ్ఆర్ అధికారి రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే భూముల రీ సర్వే

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జగనన్న భురక్ష, భూ హక్కు పథకాలతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రైతాంగ భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టిందని బాపట్ల ఆర్‌డిఒ జి రవీందర్ అన్నారు. మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో భూములకు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని గురువారం ఆర్‌డిఒ ప్రారంభించారు. అనంతరం ఆయన స్థానిక రైతులు, అధికారులతో మాట్లాడుతూ.. వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలనలో జరిగిన భూముల సర్వే అనంతరం దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో రీ సర్వే జరగటం చరిత్రాత్మకం అని అన్నారు. కోలలపూడి గ్రామంలో 3,547 ఎకరాల భూమి రీ సర్వే పూర్తి చేయటం జరిగిందని 1,817 మంది రైతులకు గాను, 1,317 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు ఆర్‌డిఒ తెలిపారు. భూముల రీ సర్వే అనంతరం సర్వే



సరిహద్దు రాళ్లను వేయిస్తున్న ఆర్‌డిఒ రవీందర్

సిబ్బంది ఏర్పాటు చేసే సరిహద్దు రాళ్లే ప్రామాణికమని, అధికారులకు తెలియకుండా ఎవరైనా రాళ్లను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ఆర్‌డిఒ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్టూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటరెడ్డి, ఆర్ఐ రహమాన్ బాషా, సర్వేయర్ ఏడుకొండలు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ శ్రీహర్ష, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల కెరీర్‌పై విలువైన సూచనలు

ప్రజాశక్తి-పంగులూరు

విద్యార్థులు బాగా చదువుకుని, మంచి ప్రయోజకులు కావాలని ఎంపీడీవో రమణమూర్తి అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారో, దానిపై లక్ష్యం ఉంచి సాధించాలని, చెడు అలవాటులకు దూరంగా ఉండి మంచి విద్యార్థులుగా పేరు తెచ్చుకోవాలని సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పంగులూరు మండలంలోని బైటమంజులూరు గ్రామాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. రికార్డులు, మెనూ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, టాయిలెట్లను పరిశీలించి, శుభ్రత విషయంలో హెడ్మాస్టర్‌కు తగు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ చేసి విద్యార్థుల విద్యాభ్యాసం, మధ్యాహ్నం భోజనం పరిశీలించి, రికార్డులను, మెనూ, స్టాక్, హాజరును పరిశీలించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇన్ టైం, అవుట్ టైం, హాజరు పరిశీలించారు. అన్ని రికార్డులను, సిబ్బంది యూనిఫామ్ పరిశీలించి గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం జగనన్న లే అవుట్లను పరిశీలించి ఐదు గృహాలు పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగిందని, అసంపూర్తి స్థాయిలో ఒక గృహం ఉందని 20 గృహాలు పునాదులు స్థాయిలో ఉన్నాయని ఎంపీడీవో తెలియజేశారు. రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ, రికార్డులను పరిశీలించారు. నమోదు నమోదు కాని ఈకేవైసీ లను పూర్తి చేయాలని వ్యవసాయ సహాయకుడిని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి వారాబంది అమలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు ఎన్ఎస్పి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్ కింద పంటలు సాగు చేస్తున్న రైతులకు, ఈ నెల ఆరో తేదీ నుంచి నీటి లభ్యతను అనుసరించి వారాబంది పద్ధతిలో సాగునీటిని వాడుకోవలసి ఉంటుందని ఎన్ఎస్పి డిఇ ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల షెడ్యూల్లో భాగంగా, ఆరు రోజులు పాటు సాగునీరు బంద్ అవుతుందని, తొమ్మిది రోజులు పాటు సాగునీరు విడుదలవుతుందని అన్నారు. ప్రస్తుతం అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో 900 క్యూసెక్కులు నీటి సరఫరా ఉందని అన్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్ పరిధిలో ఆయా మేజర్ కాలువల కింద మిరప, మొక్కజొన్న, సుబాబుల్ పంటలను రైతులు సాగు చేశారని అన్నారు. అంతేగాక తాగునీటి చెరువులను కూడా నింపాల్సి ఉందన్నారు. రైతులు వారాబంది విధానంలో విడుదలయ్యే సాగునీటిని సక్రమంగా సద్వినియోగించువాలని డిఇ కోరారు.

ఉగాదికి ఇంటి నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఇంటి నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసి లబ్ధిదారులు గృహప్రవేశం చేయాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపేట పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు అధ్యక్షతన జగనన్న ఇళ్ల లబ్ధిదారులు, పలు శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ రాజ దెబోర, ఎంపీడీవో ఎంవిఎస్ శర్మ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్మిస్తున్న జగనన్న ఇళ్లలోలో లబ్ధిదారులందరూ ఉగాదికి గృహ ప్రవేశం చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వాలెంటర్లు పలువురు పాల్గొన్నారు.



సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీ వెంకటరమణారావు

కార్పొరేట్ స్కూలుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

రాజ్యసభ సభ్యులు వెంకటరమణారావు

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్రకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. గురువారం రేపల్లె రూరల్ మండలం పేటేరు గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 6 7 తరగతి విద్యార్థినులకు సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి నాడు నేడు నిధుల ద్వారా కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేసిన ఘనత ఒక జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధితో సర్కార్ బడుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరుగుతోందని అన్నారు. లక్షల రూపాయలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం వరంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు రావు నెహ్రూ లక్ష్మి, ప్రభాకర్‌రావు సర్పంచ్ కనపర్తి వసుమతి పేటేరు వైసీపీ ఇన్‌ఛార్జి కనపర్తి రవికిరణ్, గ్రామ ఉపసర్పంచ్ జి శివపార్వతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి కృష్ణమోహన్, వైసీపీ నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆముదం పంటను పరిశీలిస్తున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ, వ్యవసాయ శాఖ అధికారులు

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని బి.చెర్లోపల్లి రైతు భరోసా కేంద్రాన్ని ఆత్మ పీడీ అన్నపూర్ణ, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం సందర్శించారు. అనంతరం పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఆముదం పంటలో తెల్ల దోమ, పచ్చ దోమ ఉధృతిగా ఉండటాన్ని గుర్తించి రైతులకు పలు సూచనలు తెలిపారు. దోమల నివారణఖు ఆముదం పంటలో పసుపు, బులుగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. దోమలు ఉధృతిగా ఉంటే అసిటామి ప్రైడ్ పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ కె.బుజ్జిబాయి, జిల్లా వనరుల కేంద్రం ఎఒ వి.వెంకటశేషమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకుడు లాల రవి, రైతులు పాల్గొన్నారు.

18న ప్రత్యేక లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఈ నెల 18న ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. భారతి గురువారం తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కుటుంబానికి సంబం ధించిన వాజ్యాలు, వినియోగదారుల వివాదాలు. కృత్రిమ మేధోసంపత్తి హక్కులకు సంబంధించిన వివాదాలు ఇరువురు కక్షిదారులు ఆమోదంలో పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

ప్రమాదం జరిగినా స్పందించరా..!

- ప్రమాద భరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు
- పిల్లలను పార్కుకు పంపేందుకు హడలుతున్న తల్లిదండ్రులు



పార్కు ముఖ ద్వారం

ప్రజాశక్తి-మార్కాపురం

ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు గల కారణాలు తెలుసుకొని మరో ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. అయితే మార్కాపురం మున్సిపాలిటీలోఅలాంటి బాధ్యతలేమీ లేనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి మున్సిపల్ పార్కు పర్యవేక్షణలో అదే జరుగుతోంది.

మార్కాపురం మున్సిపాలిటీలోని తర్లుపాడు రోడ్డులో మాగుంట సుబ్బరామిరెడ్డి మున్సిపల్ పార్కును ఆహ్లాదకరంగా తయారు చేశారు. దాని నిర్వహణ కూడా మున్సిపాలిటీదే. అక్కడ ప్రమాదాలను మాత్రం గుర్తించడం లేదు. పార్కులో ప్లే గ్రౌండ్ తూర్పు వైపున ఏర్పాటు చేశారు. ప్లేగ్రౌండ్‌కు దగ్గరగా పార్కు ప్రహరీ గోడను ఆనుకుని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు గతంలో ఏర్పాటు చేశారు. ఈ టాన్స్‌ఫార్మర్‌లు పార్కు కంచెను ఆనుకుని ఉన్నాయి. ప్లే గ్రౌండ్‌లో ఫుట్‌బాల్, ఇతర ఆటలు ఆడు కునేందుకు చిన్నారులు నిత్యం వస్తుంటారు. గత రెండు రోజుల క్రితం 6వ తరగతి చదువుతున్న పి.సుధీర్ అనే విద్యార్థి ఆట విడుపు కోసం పార్కులోకి వచ్చాడు. బంతి ఆట ఆడుతున్న సమయంలో బంతి ఎగిరి ప్రహరీని ఆనుకుని ఉన్న విదుత్ ట్రాన్స్‌ఫార్మర్ మధ్యన చిక్కుకుంది. ఆ బాలుడు విద్యుత్ ప్రమాదాన్ని గమనించకుండా బంతిని తీసుకునే ప్రయత్నంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఆ బాలుడి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. పార్కు ప్రహరీని ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదం ఉంది. మున్సిపల్ అధికారులు మాత్రం దాన్ని ఇంకా గుర్తించలేనట్లుగా ఉంది. ఇలాగే వదిలేస్తే మరి కొన్ని ప్రమాదాలు జరిగినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. తక్షణమే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పార్కు ప్రహరీకి కంచెకు అడ్డుగా ఫైబర్‌తో ఏర్పాటు చేస్తే ప్రమాదాన్ని నివారించవచ్చు. మున్సిపల్ అధికారులు, విద్యుత్ అధికారులు సమన్వయంతో ప్రమాదాన్ని నివారిం చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

బాలినేనితో కనిగిరి వైసిపి నేతల భేటీ

నియోజకవ వర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చ

ప్రజాశక్తి-పామూరు

మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కనిగిరి నియోజకవర్గ వైసిపి ముఖ్య నేతలు గురువారం భేటీ అయ్యారు. కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, కనిగిరి ఎఎంసి చైర్మన్ వైజసరితా ప్రసాద్ రెడ్డి , మాజీ ఎఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు వైసిపి నాయకుడు కల్లూరి రామిరెడ్డి తదితరులు బాలినేని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం కనిగిరి నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై బాలినేని వారితో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ విధి విధానాలపై పార్టీ నాయకులు నియోజకవర్గంలో అవలంబిస్తున్న తీరుపై చర్చించినట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ నాయకులందరూ పార్టీ బలోపేతానికి కషి చేయాలని, ఎలాంటి లోటుపాట్లు జరగకుండా ఐకమత్యంగా ఉండాలని సూచించారు.



బాలినేనితో సమావేశమైన వైసిపి నాయకులు



మాట్లాడుతున్న కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎన్.శ్రీనివాస కుమార్

భవన నిర్మాణ కార్మికులను నమోదు చేయాలి

పంచాయతీ కార్యదర్శులకు డిసిఎల్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వైఎస్ఆర్ బీమాలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగ కార్మికులను నమోదు చేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎన్.శ్రీనివాస కుమార్ ఆదేశించారు. మద్దిపాడు మండలపరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ బీమాలో నమోదైన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు నమోదు , గుర్తింపు కార్డుల మంజూరుపై సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్ల తో గురువారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ ఎంత మేరకు అయిందో అని వివరణ కోరగా ఎంపిడిఒ పరిధిలో 88 శాతం మంది నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలో సుమారు 1532 మంది వైఎస్ఆర్ బీమాలో నమోదైన భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు నమోదు కాని వారిని త్వరిత గతిని నమోదు చేయాలని తెలిపారు. గుర్తింపు కార్డుతో జీవిత బీమా, ప్రమాద బీమా, ప్రసూతి సహాయం, పిల్లల వివాహానికి ఆర్థిక సహాయం వస్తుందన్నారు. భవన నిర్మాణరంగ కార్మికులు 18 నుంచి 60 సంవత్సరాలు వారికి మాత్రమేనని, సంవత్సరం లో 90 రోజులు పని చేసి ఉండాలన్నారు. గుర్తింపు కార్డు పొందుటకు అవసరమైన డాకుమెంట్స్ ప్రొఫార్మా-27, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఓటర్ గుర్తింపు కార్డు తదితర మైనవి)ఆధార్ కార్డు తప్పనిసరి, 2 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సభ్యత్వ రుసుము రూ.50లు, సంవత్సర చందా రూ.12 చొప్పున 5 సంవత్సరాలకు రూ.60 చెల్లించాలన్నారు. మద్దిపాడు ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలో 18 గ్రామాలకు సంబంధించి 1,532 మందికి భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పిడిఒఆర్‌డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి

అటారీ డైరెక్టర్ మీరా

ప్రజాశక్తి-దర్శి

రైతులకు శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాల అటారీ డైరెక్టరు షేక్ ఎన్‌మీరా తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతులతో మాట్లాడారు. ఇక్కడ అభివృద్ధిని పరిశీలించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో చేపలు పెంపకం, గొర్రెల పెంపకం, మొక్కలు పెంపకం గురించి శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వ్యవసాయంలో వచ్చే మార్పులు గమనించి రైతులకు సలహాలు, సూచనలు అందించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. అనంతరం రైతులకు నూతన నువ్వు విత్తనాలు పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్రానికి ఉత్తమ అవార్డు వచ్చేందుకు కృషి చేసి ప్రధాన శాస్త్రవేత్త ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్‌ను శాస్త్రవేత్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు విజయానందన్, శేషుమాధవ్, ముకుందరావు, కెవికె ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాద్, శాస్త్రవేత్తలు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ రమేష్, డాక్టర్ ఉష, జాహ్నవి, వెంకటేశ్వరరెడ్డి, లీలాకృష్ణ, విశ్వనాథ్, శివ, మానస, రైతులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న మీరా